
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 16 జూన్ 2024

ప్రత్యామ్నాయమే శరణ్యం



అంతర పంటకోసం భూమిని సిద్ధం చేస్తున్న దృశ్యం

- వేరుశనగ సాగుతో ఏటా నష్టాలే
- ఇతర పంటల సాగు వైపు రైతుల మొగ్గు
- సగానికిపైగా పడిపోయిన వేరుశనగ సాగు

తాడిమర్రి, జూన్ 15: ప్రతి ఏటా నష్టాలే పలకరిస్తుండటంతో వేరుశనగ రైతులు ఈ సారి ప్రత్యామ్నాయం వైపు పరుగులు తీస్తున్నారు. గతంలో వేరు శనగ పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. అయితే ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసిన రైతులకు మాత్రం ప్రభుత్వం పరిహారం అందజేస్తూ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో రెండు సార్లు ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం పరిహారం అందించగా, ఒకసారి మాత్రం వేరుశనగ పంటకు హెక్టారుకు రూ.1007 మాత్రమే అందజేసింది. దీంతో రైతులు కూడా కంది, ఉలవ, పెసర, జొన్న, ఆముదం, ఉద్దులు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. మండలంలో వర్షాధారం కింద 12,690 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. గత ఏడాది 6630 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంట సాగుచేశారు. కందులు 1749 హెక్టార్లలో సాగు చేశారు. మిగిలిన భూమిని బీడుగా వదిలేశారు.

భారమవుతున్న వేరుశనగ సాగు

ఈ ఏడాది ప్రభుత్వం సబ్సిడీపై 3178 మంది రైతులకు 2730 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసింది. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 10 క్వింటాళ్ల ఎల్ఆర్జీ 52రకం కందులను రైతులకు అందుబాటులో ఉంచింది. ఈ కందులు కూడా అగ్రహారం, తాడిమర్రి గ్రామ పంచాయతీలకు సంబంధించిన రైతుల కోసం తెప్పించినట్లు వ్యవసాయాధికారి రమాదేవి తెలిపారు. వేరుశెనగ పంట సాగుచేయడానికి ఎకరానికి కనీసం రూ.15వేలు ప్రస్తుతం ఖర్చవుతోంది. విత్తనాల కోసం రూ.10,800, డీఏపీ కోసం రూ.1400, విత్తన శుద్ధి మందు కోసం రూ.200, వ్యవసాయం కోసం రూ.2600 ఖర్చవు తోంది. ఇక కూలీలు పురుగుల మందుల ఖర్చులు వేసుకుంటే రూ.20వేలు దాటుతుంది. ఇలాంటి పరిస్థితిలలో రైతులు వేరుశనగ పంట సాగు చేయ డానికి సాహసించడం లేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంట విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

పూర్తిగా నష్టపోయాం



గడచిన ఐదేళ్లలో వేరుశనగ పంట సాగు చేసి పూర్తిగా నష్టపోయాం. ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఇకమీదట ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందితే తప్పా వేరుశనగ సాగుచేయలేం.

- లక్ష్మీనారాయణరెడ్డి, మద్దెలచెరువు

ప్రత్యామ్నాయమే శరణ్యం



కంది పంట సాగుచేయడం మంచిదని హైబ్రీడ్ వంగడాల కోసం ఎదురు చూస్తున్నాం. కంది పంటకు ఎక్కువగా పురుగుల మందు కూడా వాడాల్సిన అవసరం ఉండదు. తక్కువ ఖర్చుతోనే పంటలు తీసుకోవచ్చు.

- రమణ, చిల్లకొండయ్యపల్లి

సైకిల్ ఎక్కేద్దామా..?


వైసీపీ నాయకుల పక్క చూపులు

- టీడీపీలో చేరుదామని కేడర్ ఒత్తిడి
- అభివృద్ధి కోసమంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు
- కొందరిని వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూన్ 15: రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో జిల్లాలో రాజకీయం రంజుగా మారింది. వైసీపీ తరఫున గెలిచిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు మరికొంతమంది నాయకులు ఆ పార్టీకి టాటా చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. అధికార పార్టీ తెలుగుదేశంలో చేరడానికి రాయబారాలు నడుపుతున్నారు. గతంలో తెలుగుదేశం నుంచి వైసీపీలోకి వెళ్లి పదవులు పొందిన వారు సైతం టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రతిపక్షంలో ఉంటే మనుగడ అసాధ్యమని భావిస్తున్నారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కరూపాయి కూడా సంపాదించుకోలేదని, కనీసం సొంత బజార్ లో వీధిలైట్లు, డ్రైనేజీలు కూడా నిర్మించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పార్టీలో ఉండటం కంటే టీడీపీలో చేరడం ఎంతో నయమని కొంతమంది వైసీపీ నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఈక్రమంలోనే వైసీపీ నాయకుల వద్ద ఉన్న అనుచరవర్గం పార్టీ కండువ మార్చేద్దామంటూ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

అందరి చూపు అధికార పార్టీవైపే..!

అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు వైసీపీతోపాటు మరో రెండు పార్టీల నాయకులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించి అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో వైసీపీ నుంచి గెలుపొందిన స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో సైకిల్ ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు. పల్లె మొదలు పట్నం వరకు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా వైసీపీ వారే ఉన్నారు. కానీ రాష్ట్రంలో వైసీపీ ఘోర పరాజయం పొందడంతో వారంతా పార్టీలో ఉండటం కంటే వెళ్లిపోవడమే నయమని భావిస్తున్నారు. దీనికితోడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కావడంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని, నిధులు పుష్కలంగా తీసుకొస్తారన్న నమ్మకం కూడా వైసీపీ నాయకుల్లో మెండు గా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్షంలో ఉండటంకంటే అధికార పార్టీలో చేరి నమ్ముకున్న వారికి న్యాయం చేద్దామనే ఆలోచనలో కొందరు కౌన్సిలర్లు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే హిందూపురం నియోజకవర్గంలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు, మండలస్థాయి ప్రజాప్రతినిధులు టీడీపీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. వారికి ఉన్న పరిచయాలతో ఎలాగైనా సైకిల్ ఎక్కవచ్చని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. చాలామంది నియోజకవర్గస్థాయి నేతలు సైతం పక్కచూపులు తొక్కుతున్నారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడి ప్రస్తుతం వైసీపీ నాయకులను చూస్తే అర్థం అవుతుంది. ఎందుకంటే ఏడాది కిందటి వరకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం వస్తే అడ్డుకున్న వైసీపీ నాయకులే నేడు పార్టీ కండువా కప్పుకుని బాలయ్యవెంట ఉంటామని చెప్పడం విడ్డూరంగా ఉంది.



వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకులు

ఇదిలా ఉంటే మొన్నటి వరకు టీడీపీ నాయకులకు చుక్కలు చూపిన కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. మరీ ముఖ్యంగా కల్లు, మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు కండువాలు మార్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ఇలాంటి వారిని టీడీపీలో చేర్చు కోకూడదని కొంతమంది అధికార పార్టీ నాయకులు గట్టిగా అడ్డు తగులుతున్నారు. ఎందుకంటే ఈ ఐదేళ్ల కాలంలో కొంతమంది కర్ణాటక మద్యం ద్వారా కోట్లాదిరూపాయలు సంపాదించుకున్నారు. ఈ పరిస్థితుల్లో వారి వ్యాపారాల కోసం పార్టీ కండువాలు కప్పుకుంటామంటే సహించేది లేదంటూ టీడీపీ నాయకులు చెబుతున్నారు.

కలకు కళ వచ్చేనా ?

- సూరప్ప కుంట దశ మారేనా..?
- టీడీపీ హయాంలో ఎకో పార్కుకు ఏర్పాట్లు
- వైసీపీ పాలనలో మూలకు చేరిన ప్రాజెక్టు
- అధికార మార్పిడితో అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు



నీటితో నింపాలనుకున్న సూరప్పకుంట ఇదే..

హిందూపురం అర్బన్, జూన్ 15: హిందూపురం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి గత టీడీపీ పాలనలో అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇందు కోసం అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా తీవ్రంగా ప్రయత్నించారు. ఈక్రమంలోనే పట్టణానికి ఓ వైపున ఉన్న సూరప్ప కుంటను సుందరీకరించాలని తలంచారు. అందులో భాగంగానే 2019 ఫిబ్రవరి 2న వంద ఎకరాలకు పైగా ఉన్న సూరప్ప కుంటను ఎకో పార్కుగా మలిచి సుందరీకరించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. చెరువులు నీటిపారుదల శాఖకు చెందినవి కాబట్టి దానిని అటవీ శాఖకు బదిలీ చేసి, పర్యావరణ పరిరక్షణ కింద చెరువులో నీటిని నింపి ఎకో పార్కుగా తీర్చిదిద్దాలని చూశారు. చెరువు కట్టపై గొప్ప నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసి హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్‌లా తీర్చిదిద్దాలను ప్రణాళిక చేపట్టారు. రహమత్‌పురం, సీపీఐ కాలనీ వద్ద పార్కును సుందరీకరించి, చిన్న పిల్లలు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలనుకున్నారు. సూరప్ప కుంటలో బోటింగ్‌ను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రయత్నించారు. లేపాక్షితో పాటు హిందూపురంను పర్యాటక కేంద్రంగా మలచాలని అప్పట్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆంధ్రప్రదేశ్ అటవీశాఖతో సంప్రదింపులు కూడా చేశారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈక్రమంలోనే చెరువు కట్టకు మట్టి తోలి, రాళ్లతో పటిష్టం చేశారు. మధ్యలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహంను కూడా ఏర్పాటు చేశారు. చెరువుకు మధ్యలో వంతెన నిర్మించి రెస్టారెంట్‌ను ఏర్పాటు చేస్తే పర్యాటకులు, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు తరలి వస్తారని, పురం పేరు ప్రతిష్టలు రాష్ట్రం నలమూలల విస్తరిస్తాయని భావించా రు. అయితే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారం వైసీపీ హస్తగతం కావడంతో ఎకో పార్కు ప్రాజెక్టు మూలన పడింది. ఎకో పార్కు ఏర్పాటు చేస్తే తెలుగుదేశం పార్టీకి ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న ఉద్దేశ్యంతో వైసీపీ ప్రభుత్వం దాన్ని పక్కకు నెట్టేసింది. అయితే రాష్ట్రంలో అధికారం ఇపుడు మళ్లీ టీడీపీ హస్తగతం కావడంతో ప్రజల దృష్టి ఎకో పార్కువైపు మళ్లింది. బాలయ్య హయాంలో సూరప్ప కుంటను సుందరీకరించి ఎకో పార్కును ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



2019లో ఎకో పార్కుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం



నిలువెత్తు ఎన్టీఆర్ విగ్రహం

అలరించిన భజగోవిందం



నాటికలోని సన్నివేశాలు



పుట్టపర్తి, జూన్ 15: భజగోవిందం నాటికతో మధ్యప్రదేశ్ బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి భక్తులను అలరించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రెండు వేల మంది సాయిభక్తులు పర్తియాత్రపేరిట శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి అష్టోత్తరశతనామావళి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలవికాస్ చిన్నారులు భజగోవిందం నాటికను ప్రదర్శించారు. సంగీత నృత్యంతో భక్తులను అలరించారు. ఆ రాష్ట్ర సేవా సంస్థల అధక్షులు అమిత్‌దుబే రాష్ట్రంలో చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వీడియో ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న మాజీ ముఖ్యమంత్రి

మహారాష్ట్ర మాజీముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు అశోక్‌చవాన్ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆయన బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం 5 గంటలకు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగి బెంగళూరుకు వెళ్లారు.

చదువుతోనే మెరుగైన జీవనం: డీఈఓ



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న డీఈఓ

కొత్తచెరువు, జూన్ 15: ప్రస్తుత సమాజంలో మంచి జీవనానికి చదువే మార్గమని జిల్లా విద్యాధికారిణి మీనాక్షి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులకు నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని ఎంఈఓ జయచంద్ర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల నుండి ప్లకార్డులు, బ్యానర్లు చేత బూని సర్కారు బడికి పోదాం, అమ్మనేను బడికిపోతా, నాన్న నేను బడికి పోతా అంటూ నినాదాలు చేస్తూ నెహ్రూ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ద్వారా బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించినప్పుడే వారు సమాజంలో జీవించడానికి మార్గాలను ఏర్పరచుకుంటారన్నారు. చదువుతోనే మనుషుల తలరాతలు మారుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరు చదువుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ పని తీరు భేష్

పోలీసు సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ప్రశంస

ప్రశాంత ఎన్నికల నిర్వహణపై అభినందన



ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 15: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థంగా పని చేసిందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎలక్షన్ సెల్ స్పెషల్ బ్రాంచ్, సెబ్‌సిబ్బంది, పోలీసు అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి జిల్లా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించారని ప్రశంసించారు. పోలీసు యంత్రాంగం యావత్తు సమష్టిగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లే ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. సెబ్ అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండటం వల్లే కర్ణాటక మద్యం, నగదుకు అడ్డుకట్ట వేయగలిగామన్నారు. ఎలక్షన్ సెల్, స్పెషల్ బ్రాంచ్ నిరంతరం అప్రమత్తంగా పని చేస్తూ ప్రతి సమాచారం ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూంకు చేరవేసిందని తెలిపారు. దీంతో ఎన్నికల కమిషన్‌కు సరైన సమయంలో సమాచారాన్ని పంపగలిగి జిల్లాలో గర్వంగా చెప్పుకునే పరిస్థితిని సిబ్బంది కల్పించారన్నారు. ఎలక్షన్ సెల్ సీఐ విక్రమ్, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యం ప్రదీప్‌కుమార్ వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ విష్ణు, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం ఈఎస్ సుబ్రహ్మణ్యం తమ విధులను సమర్థవంతంగా నిర్వహించినట్లు కితాబునిచ్చారు. అనంతరం ఎన్నికల విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన 60 మంది పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తరలిపోతున్న పేడ ఎరువు

- కిలో రూ.2 ప్రకారం ఇతర ప్రాంతాలకు విక్రయం
- కొనుగోలు చేయలేని స్థితిలో స్థానిక రైతులు
- ఫలితంగా పంట పొలాల్లో తగ్గుతున్న సేంద్రియ కర్బనం
- అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ విఫలం

తనకల్లు, జూన్ 15: మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు పశువుల ద్వారా సేకరించిన సేంద్రియ ఎరువులను ఇతర ప్రాంతాలకు అమ్మేస్తున్నారు. కిలో రూ2 ప్రకారం బెంగళూరు, చిక్‌బళ్లాపురం, పులివెందుల, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన పెద్ద రైతులకు అమ్మేస్తున్నారు. 25 కేజీల ప్యాకెట్‌ను రూ.50 ధర చెల్లించి కొనుగోలు చేస్తుండటంతో పలువురు చిన్న, సన్నకారు రైతులు, పశువుల కాపరులు తమ సేంద్రియ ఎరువులను ఇతర ప్రాంతాలకు విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. అయితే అంత ధర చెల్లించలేక స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండలంలో పని చేస్తున్న జనజాగృతి సంస్థ చైన్నై యునివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలతో కలిసి మండలంలోని ఎర్రమల్లి, నడిమికుంటపల్లి, పెద్దపల్లి, గౌళ్లపల్లి తదితర గ్రామాల్లో సేంద్రియ కర్బనంపై పరిశోధనలు నిర్వహించారు. ఎర్రబల్లి, నడిమికుంటపల్లి వ్యవసాయ పొలాల్లో సేంద్రియ కర్బనం తగ్గిపోతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. రసాయన ఎరువులను అవగాహన లేకుండా ఇష్టానుసారం ఉపయోగించడంతో భూముల్లో సేంద్రియ కర్బనాలు తగ్గిపోయి, పంటలు పండే పరిస్థితి లేకుండా పోతోందని వారు తెలిపారు. రైతులు సేంద్రియ కర్బనం అధికంగా ఉన్న చెరువు మట్టికానీ, సేంద్రియ ఎరువులుకానీ కొనుగోలు చేసి, భూములకు తరలించలేని పరిస్థితిలో ఉన్నారు. రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ కేవలం విత్తనాల సరఫరా, ఇన్‌పుడ్ సబ్సిడీ, బీమా, ఈకేవైసీ లాంటివి అమలు చేయడానికే పరిమితమయినట్లు ఆరోపణలున్నాయి.



సేంద్రియ ఎరువును బస్తాల్లో నింపి వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం

ప్రభుత్వాలే ప్రోత్సహించాయి..




నా చిన్నతనంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉండేవి కాదు. ఇప్పుడు మా మండలంలోనే పదికిపైగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించే అంగళ్లున్నాయి. ప్రభుత్వమే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను ప్రోత్సహించి, వాడేలా చేసింది. మా గ్రామంలో దుక్కి దున్నినప్పటినుంచి పంట కోతకు వచ్చేదాకా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు పోటీలు పడి వాడుతున్నారు. ఏ అధికారి గ్రామనికి వచ్చి సేంద్రియ ఎరువుల వాడకంపై సలహా ఇవ్వడంలేదు. దీంతో మా గ్రామంలో తయారయ్యే సేంద్రియ ఎరువును ఇతర ప్రాంతాలకు అమ్మేస్తున్నారు. రైతుల్లో సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

- వెంకటరమణరెడ్డి, రైతు, నడిమికుంటపల్లి



విక్రయించడానికి సిద్ధంగా సేంద్రియ ఎరువు

ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలి



నేను నాకున్న భూమితోపాటు ఇతరుల భూములు కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నా. ప్రత్యేకంగా క్యారెట్, దోస, మిరప, కర్బూజ లాంటి పంటలు సాగు చేస్తున్నా. సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన లేకపోవడంతో క్రిమిసంహాకర మందులు, రసాయనిక ఎరువులు వాడుతు న్నాం. ఈకారణంగా భూముల్లో ఉత్పాదకత తగ్గిపోయి ఇబ్బందులు పడుతు న్నాం. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి.

- శ్రీరాములనాయక్, రైతు, మొగిలిచెట్లతండా

అవగాహన కల్పిస్తున్నాం

రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించేలా అవగాహన కల్పిస్తున్నాం. అయినా రైతులు క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులను వాడుతూనే ఉన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులపై ఆంక్షలు లేకపోవడంతో రైతులు అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు వాడే సమయంలో రైతు భరోసా కేంద్రాలలో ఉన్న విలేజ్ అగ్రికల్చర్, సెరికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లతో సూచనలు, సలహాలు తీసుకోవాలి. ఇప్పటికై మండల వ్యాప్తంగా రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్న గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

- శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు

19 నుంచి ఐటీఐ కళాశాల అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, జూన్ 15: ఐటీఐ కళాశాలల్లో 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు శనివారం జిల్లా కన్వీనర్, అనంతపురం ప్రభుత్వ ఐటీఐ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 19న పది నుంచి 7వరకు. 20న 6.8నుంచి 5వరకు. 21న 4.8నుంచి 0వరకు పదవ తరగతి మార్కుల జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. టెన్త్ మార్కులు, టీసీ, స్టడీ, కుల ధృవీకరణ, ఆధార్ ఒరిజినల్‌తోపాటు పాస్‌ఫోటో తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9866782452 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం


రుషీల్‌రెడ్డి


ధరణికుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. శనివారం స్థానిక అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. కర్నూలు, నెల్లూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు 27.3ఓవర్లలో 121పరుగులకు ఆలౌట్ అయ్యింది. నయాముల్లా 50 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 23.5ఓవర్లలో వికెట్ నష్టానికి 125పరుగులు చేసి 9వికెట్ల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు బ్యాటర్లు రేవంత్‌రెడ్డి 53పరుగులు, నిఖిలేశ్వర్‌రెడ్డి 56పరుగులు సాధించారు. మరో మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు పోటీపడగా మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 50ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 220పరుగులు చేసింది. విజయ రామిరెడ్డి 66 పరుగులు, వాసుదేవరాజు 50పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 40.1ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. చిత్తూరు బ్యాటర్ రుషీల్‌రెడ్డి 104పరుగులు, ధరణికుమార్ 57పరుగులు చేశారు. పోటీలను క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి పర్యవేక్షించగా సెలెక్టర్లు నాగినికుమార్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణే ధ్యేయం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూన్ 15: జిల్లా ప్రజలను కలవర పెడుతున్న క్యాన్సర్ వ్యాధిని నివారించడమే ధ్యేయంగా పనిచేయాలని డాక్టర్లు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులు, సీహెచ్‌ఓలు, అర్బన్ ఏఎన్ఎంలకు కాన్సర్ స్క్రీనింగ్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. రొమ్ము, నోరు, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వాటికి స్క్రీనింగ్ పరీక్షలు ఎలా చేయాలి, ఎలా నిర్ధారించాలి, పాజిటివ్ వచ్చినవారికి చికిత్స, భవిష్యత్తులో నిర్వహించాల్సిన పరీక్షల గురించి వివరించారు. అనంతరం వైద్య కళాశాల ల్యాబ్‌కు తీసుకువెళ్లి స్క్రీనింగ్ పరీక్షలను ప్రాక్టికల్‌గా చూపించారు. ఇటీవల క్యాన్సర్ వ్యాధి వివిధ రూపాలలో వ్యాప్తి చెందుతోందని అన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడదని అన్నారు. కాన్సర్ వ్యాధిని నివారించడానికి అవకాశం ఉంటుందని, అందుకే ప్రభుత్వం ముందస్తు చర్యలకు అడుగులు వేసిందని అన్నారు. అందులో భాగంగా అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తోందని అన్నారు. మహిళలు రొమ్ము పరీక్ష చేయించుకోవాలని, దుర్వాసనతో కూడిన తెల్లబట్ట లక్షణాలు ఉన్నపుడు వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు వినియోగించే పురుషులు నోటిలో ఎలాంటి పుండ్లు ఉన్నా వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అవసరమైన చికిత్స సులభంగా పొంది, జీవిత కాలం పెంచుకోవచ్చని అన్నారు. అనుమానితులందరికీ కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, అపుడే అనుకున్న మేరకు కాన్సర్ నివారణ ఆశయం నెరవేరుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్యాన్సర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, డాక్టర్లు ప్రమోద్, ప్రశాంతి, రాజేంద్ర, మహేంద్ర, వైద్యశాఖ నోడల్ అధికారులు సుజాత, రవిశంకర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త భార్యపై దాడి


గాయపడ్డ చౌడమ్మ

లేపాక్షి, జూన్ 15: మండల పరిధిలోని మామిడిమాకులపల్లిలో టీడీపీ కార్యకర్త శ్రీరాములు భార్య చౌడమ్మపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు విశ్వనాథ్ కొడవలితో దాడి చేశాడు. బాధితులు తెలిపిన మేరకు ఎన్నికల్లో ఓటమి తరువాత వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్త శ్రీరాములు ఇంటివద్ద ప్రతిరోజూ తాగి గొడవ చేస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి విశ్వనాథ్ మద్యం సేవించి గొడవకు వెళ్లాడు. అక్కడే ఉన్న శ్రీరాములు భార్య చౌడమ్మ.. తన భర్తను గదిలోకి వేసి తలుపులు వేసింది. దీంతో ఆగ్రహించిన విశ్వనాథ్ అక్కడే ఉన్న కొడవలితో చౌడమ్మపై దాడిచేశాడు. ఆమెకు రక్తగాయాలు కావడంతో భయపడి పారిపోయాడు. ఆమెను బంధువులు లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్‌ఐ లేకపోవడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పోలీస్ స్టేషన్‌కు శనివారం ఉదయం వెళితే.. ఎస్‌ఐ సెలవుపై వెళ్లారని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకు పడిగాపులు కాశారు. ఆ తరువాత స్టేషన్‌కు వచ్చిన హిందూపురం రూరల్ సీఐ ఈరన్న వారితో మాట్లాడారు. ఆస్పత్రిలో రాయి తగిలినట్లు చెప్పి చికిత్స చేయించుకున్నారు కదా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులతో రాజీ చేసుకోవాలని, లేకపోతే కేసు నమోదు చేస్తానని బెదిరించారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. మాట్లాడి పంపిస్తానని అన్నారు. వివరాలు చెప్పకుండా ఫోన్ కట్‌చేశారు. తమకు ప్రాణహాని ఉందని, ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

పెద్దాసుపత్రి ఆకస్మిక తనిఖీ


ఆస్పత్రి వైద్యాధికారులతో చర్చిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్


'ఏమ్మా..డాక్టర్లు మంచిగా చూస్తున్నారా?' అంటూ పసిబిడ్డను ఎత్తుకొని బాలింతను అడుగుతున్న ఎమ్మెల్యే

వైద్యాధికారులతో ఎంపీ, ఎమ్మెల్యే సమావేశం

సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

అనంతపురం టౌన్, జూన్ 15: జిల్లా సర్వజన వైద్యశాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. గైనిక్ వార్డులో వసతులను పరిశీలించారు. పడకలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సకాలంలో వస్తున్నారా..? ఔషధాలు ఇస్తున్నారా..? బేబీ కిట్లు వస్తున్నాయా..? అని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్, హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యలను, నిధులు, ఔషధాల నిల్వలను అడిగి తెఉసుకున్నారు. నివేదిక తయారుచేసి ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించారు.

బాధ్యతగా పనిచేయండి

ఆస్పత్రి పరిశీలనకు తరచూ వస్తుంటామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని వైద్యాధికారులు, వైద్యులకు ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. ఆస్పత్రి ఆవరణ, అన్ని వార్డులు పరిశుభ్రతంగా ఉండేలా చూడాలని సూచించారు. సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసికెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. టీడీపీ హయాంలో పనులు ప్రారంభమై అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయిస్తామని అన్నారు. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణంపై త్వరలో సమావేశం నిర్వహించుకుని, తగిన నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఆస్పత్రికి 1200 పడకలు తప్పకుండా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: జేసీ, ఎస్పీ


బక్రీద్ పండుగ సమీక్షలో మాట్లాడుతున్న జేసీ, ఎస్పీ

అనంతపురం టౌన్/క్రైం, జూన్ 15: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టరు కేతన్ గార్గ్, ఎస్పీ గౌతమి శాలి సూచించారు. ఈ నెల 17న బక్రీద్ ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈద్గాలు, దర్గాల వద్ద పరిసరాలను శుభ్రం చేయించాలని సూచించారు. ఆ రోజు ముస్లింలకు అవసరమైన వసతులు కల్పించాలని, మాంసపు వ్యర్థాలను తరలించడానికి మున్సిపల్ వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కబేళాల వద్ద గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నితమైన ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నగరపాలిక కార్యాలయంలో కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్ల గురించి సమీక్షించారు. సమీక్షలలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి రామసుబ్బారెడ్డి, జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ ప్రతాప్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మీనాక్షి, డిప్యూటీ తహసీల్దారు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూపీఎస్సీ ప్రిలిమ్స్

- ఏడు కేంద్రాలు.. 2,795 మంది అభ్యర్థులు
- అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

అనంతపురం టౌన్, జూన్ 15: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రిలిమినరీ పరీక్షలు జిల్లాలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టరు వినోద్ కుమార్ శనివారం వెల్లడించారు. జిల్లాలో 2,795మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9-30 గంటల నుంచి 11-30గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2-30గంటలనుంచి సాయంత్రం4-30వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి సెంటర్ పర్యవేక్షణకు ఓ జిల్లా అధికారితో పాటు ఏడుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఏడుగురు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లేటపుడు తనిఖీ చేయడానికి మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయించి, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అరగంట ముందు కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఏదో ఒక ఐడెంటీకార్డు తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకు రాకూడదని కలెక్టరు సూచించారు. పరీక్షలకు సంబంధించి ఏసమస్య ఉన్నా పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏసమస్య వచ్చినా 8500292992 ఈనెంబరుకు ఫోన్‌చేసి తెలిపితే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

రేపు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాక



అనంతపురం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో జిల్లాకు తొలిసారిగా పయ్యావుల కేశవ్ రానున్నట్లు ఆ పార్టీ ముఖ్యుల ద్వారా సమాచారం అందింది. సోమవారం ఆయన జిల్లాకు వస్తున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దు నుంచి భారీగా స్వాగతం పలికేందుకు ఆ పార్టీ శ్రేణులు, పయ్యావుల అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు సన్నాహకాల్లో నిమగ్నమయ్యారు.

విత్తన వేరుశనగ పంపిణీలో జాప్యం వద్దు

- త్వరితగతిన పంపిణీ చేయాలి
- జిల్లా వ్యవసాయాధికారికి మంత్రి సత్యకుమార్ ఆదేశం



ధర్మవరం, జూన్ 15: ధర్మవరం నియోజకవర్గంలో విత్తన వేరుశనగ పంపిణీ ఆలస్యంగా జరుగుతున్నట్లు తెలుసుకున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌ద్వారా జిల్లా వ్యవసాయాధికారితో సంప్రదించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. విత్తనాలు విత్తే సమయం ముగుస్తున్నా.. సకాలంలో అధికారులు విత్తన కాయలు పంపిణీచేయకుండా జాప్యం చేస్తున్నారని, దాని వల్ల పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్టు ఆరోగ్యశాఖ శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు నియోజకవర్గంలోని కొందరు నాయకులు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన మంత్రి శనివారం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుకు ఫోన్ చేసి మాట్లాడారు. విత్తన పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించినట్లు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనపంపిణీ జాప్యానికి కారణాలను అడిగారన్నారు. విత్తనాల పంపిణీ మండలాల వారీగా జరుగుతోందని, తాడిమర్రి మండలంలో ఇప్పటికే పంపిణీ పూర్తయిందని, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరంలో పంపిణీ చేయాల్సి ఉందని మంత్రికి వివరించామన్నారు. పంపిణీ జరగని చోట తక్షణమే పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

71510 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ



అనంతపురం అర్బన్, జూన్ 15: జిల్లాలోని ఆర్బీకేల్లో శనివారం 19వ రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 79615 మంది రైతులకు 71510 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 82922 మంది రైతులు 72878 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

వీధి రౌడీల్లా మాట్లాడింది మర్చిపోయారా?

వైసీపీ నేతలకు సీపీఐ జగదీష్ చురకలు

అనంతపురం విద్య, జూన్ 15: వైసీపీ నాయకుల తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని, గతంలో వీధి రౌడీల్లా మాట్లాడింది, వ్యవహరించిన తీరు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మర్చిపోతే ఎలా అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల మాజీ మంత్రి కొడాలి నానీ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ టీడీపీ ప్రభుత్వం, నాయకులపై విమర్శలు చేయడంపై జగదీష్ అసహనం వ్యక్తం చేశారు. కొడాలి నాని, గోరంట్ల మాధవ్ అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుని ఉద్దేశించి నానా దుర్భాషలాడటం, వ్యక్తిగత దూషణలు చేసి అవమానించారని, ఇప్పుడు వాళ్లు వాటిని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. గతంలో చంద్రబాబు, లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వారి కుటుంసభ్యులను సైతం వైసీపీ నాయకులు నీచంగా మాట్లాడారన్నారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి, చంపేయడం, ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేయడం, మాచర్లలో గూండాల దాడులు....ఇలా చెప్పుకుంటూ పోతే వైసీపీ అరాచకాలకు అంతేలేదన్నారు. అధికారం పోయాక ఇప్పుడు తమ కార్యకర్తలపై దాడులు అంటూ...వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని జగదీష్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు పశ్చాత్తాపంతో తాము చేసిన అరాచకాలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

పీడ వదిలింది..!

పంచాయతీల్లో 'కూటమి' సంబరం

వైసీపీ ప్రభుత్వంలో నిధుల మళ్లింపు

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సర్పంచ్‌లు

అనంతపురం న్యూటౌన్, జూన్ 15: వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గ్రామ స్వపరిపాలనకు అడ్డంకులు తొలగినట్లేనని మెజార్టీ సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను నాటి సీఎం జగన్ సొంత పథకాలనకు మళ్లించారు. దీంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం కొందరు సొంత డబ్బులను వెచ్చించారు. తెలుగుదేశం పార్టీ మద్దతు సర్పంచ్‌లు మరిన్ని ఇబ్బందులు ఎదర్కొన్నారు. మంచి రోజులు రాకపోతాయా అని అవమానాలు భరిస్తూ మూడేళ్లుగా కాలం గడుపుతున్నారు. వైసీపీ సర్పంచ్‌ల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. గెలిచాం.. ఇక అంతా తమదే అని భావించిన వారికి జగన్ చుక్కలు చూపించారు. పైసా నిధులు లేక, ప్రజలకు ముఖం చూపించలేక పోయారు. సర్పంచ్ అని చెప్పుకునేందుకూ ఇబ్బంది పడ్డారు.

నిధుల మళ్లింపు..

పంచాయతీల ఖాతాల్లో పైసా లేకపోగా.. ఆదుకుంటాయని భావించిన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం నవరత్నాలకు జగన్ మళ్లించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి రూ.8,629 కోట్లు రాగా.. పంచాయతీలకు పైసా ఇవ్వలేదు. మొత్తం సొమ్మును పథకాల అమలుకు మళ్లించారు. దీంతో పంచాయతీల అభివృద్ధి అటకెక్కింది. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల పరిధిలో 1,044 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 15 శాతం మంది టీడీపీ మద్దతుదారులు సర్పంచులుగా ఉన్నారు. మిగిలిన సర్పంచులు వైసీపీ మద్దతు దారులే. అయినా జగన్ కనికరం చూపలేదు. సొంత పార్టీ సర్పంచులకూ హ్యాండిచ్చారు. సర్పంచుగా గెలిచి, ప్రజలకు సేవ చేయాలన్న ఆసక్తి ఉన్నవారికి గడిచిన మూడేళ్ల పాలన పీడకలగా మిగిలిపోయింది.

అడొక పీడకల

రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎట్లో.. పంచాయతీకి సర్పంచ్ అట్ల. అంతటి కీలకమైన పదవి వైసీపీ పాలనలో 'పవర్ కట్' అన్నట్లుగా మారిపోయింది. పంచాయతీ ఖాతాలో పైసా లేకపోవడంతో తమకు ఓట్లు వేసిన జనం కనీస అవసరాలను కూడా సర్పంచులు తీర్చలేకపోయారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి వాటికీ నిధుల కొరత వేధించింది. కొంత మంది సర్పంచులు పరిస్థితిని చూసి సొంత డబ్బును వెచ్చించారు. ప్రజలకు ముఖం చూపించలేక.. అప్పులు తెచ్చి చేతులు కాల్చుకున్నారు. నెత్తీ నోరు బాదుకున్నా జగన్ కరుణించలేదని గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఎంతో ఉత్సాహంతో ఎన్నికల్లో నిలబడిన తాము.. గెలిచాక ఉత్సవ విగ్రహాల్లా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని గమనించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఇక మేలు చేస్తారని సర్పంచ్‌లు భావిస్తున్నారు. పల్లెల్లో పరిపాలన గాడిన పడుతుందని, తమకు తగినన్ని నిధులు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో తాజా పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కోరింది. పంచాయతీల వనరులు, పన్నులు, నిధుల ఖర్చు, కేటాయింపులు తదితర వివరాలను అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

పైసా ఇవ్వలేదు..



వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వలేదు. పంచాయతీల పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్టాంపు డ్యూటీ ఫండ్ కూడా రాలేదు. పన్నుల రూపంలో అంతో ఇంతో వచ్చిన సొమ్మును విద్యుత్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చింది. అభివృద్ధి పని చేయాల్సి వస్తే మేమే సొంతంగా చేయాల్సిందే. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉండదని అనుకుంటున్నాం.

– శివశంకర్, సర్పంచ్, చిన్నంపల్లి

ఇక మంచిరోజులు..



టీడీపీ కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో కూడా టీడీపీ భాగస్వామి అయినందున నిధులు మరిన్ని వస్తాయి. రాష్ట్ర నిధులతో పాటు కేంద్రం నిధులు వస్తాయి. అభివృద్ధికి ఎక్కువ తెచ్చుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి సమస్య ఉండదు.

– క్రిష్ణమూర్తి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు పలికాయి. కనిష్ఠ ధర రూ.14 వేలు, సరాసరి ధర రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 660 టన్నుల కాయలు విక్రయానికి వచ్చాయని తెలిపారు.

బీటెక్, ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 15: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఫార్మసీ-డి ఫలితాలను విడుదల చేసినట్లు శనివారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో బీటెక్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్15,19). ప్రథమ సెమిస్టర్(ఆర్15,19,20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఫార్మా-డి ఐదవ సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

18, 19న కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 15: కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం ఈనెల 18, 19 వ తేదీల్లో జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఈనెల 18వతేదీన ముగ్గురు సభ్యులు కలిగిన ఇంటర్ మినిస్టీరియల్ బృందం సభ్యులు జిల్లాకు చేరుకోనున్నారు. జిల్లాలోని విడపకల్లు, కణేకల్లు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల్లో పర్యటించి 2023-24 రబీ సీజన్‌లో పంటనష్టం వివరాలపై ఆరా తీయనున్నట్లు తెలిసింది. ఆయా స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. 2023-24 రబీ సీజన్‌లో వర్షాభావంతో పప్పుశనగతోపాటు ఇతర రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. రబీ సీజన్‌లో 37195 హెక్టార్లల్లో రూ.రూ.36.86 కోట్లు పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ బృందం పర్యటన నేపథ్యంలో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అనంతపురం ఏడీఏ రవి, టెక్నికల్ ఏఓ బాలూనాయక్‌లతో చర్చించారు. బృందం సభ్యులకు బస ఏర్పాట్లతోపాటు పర్యటనకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలను క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు.

కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ

కొనియాడిన సాహితీవేత్తలు


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 15: కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) వర్ధంతిని పురస్కరించుకుని శనివారం విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన చిత్రపటానికి మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సాహితీకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మాట్లాడుతూ... శ్రమజీవుల జీవితాలను పూర్తిగా ప్రేమించే హృదయం కలిగిన కవి శ్రీశ్రీ అని కొనియాడారు. అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడన్నారు. ఎస్కేయూ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి, అనంతం, చరమరాత్రి కథలు వంటి కావ్యాలద్వారా తెలుగు సాహిత్యలోకంలో తనకంటూ ఒక యుగాన్ని సృష్టించుకున్న యుగకర్త శ్రీశ్రీ అన్నారు. కార్యక్రమంలో జాషువా సాహిత్యపీఠం ఆర్గనైజింగ్ సెక్రటరీ పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు, సాయి, వెంకటరమణనాయుడు, వాల్మీకి పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

పుట్టపర్తి రూరల్, జూన్ 15: తక్కువపెట్టుబడి, అధిక దిగుబడి లక్ష్యంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ సిబ్బందికి నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ జరిగింది. ఇందులో ఏరువాక శాస్త్రవేత్తలు జాన్సన్, రామసుబ్బయ్య, కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణ పాల్గొని వేరుశనగ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, వేరుశనగ విత్తన ఉత్పత్తిపై స్ర్కీన్ ద్వారా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్‌సీడ్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ కేశవమూర్తి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విద్యావతి, మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం, జూన్ 15: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని విభిన్నప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు నాగూర్‌ఉమర్ కోరారు. ఆయన అనంతపురంలో ఉమ్మడి జిల్లా దివ్యాంగుల కార్యాలయ ఏడీ రసూల్‌ను శనివారం కలిసి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల పథకాలను దివ్యాంగులకు పార్టీలకతీతంగా అందించడానికి కృషి చేయాలని కోరారు. అలాగే పలు సమస్యల్ని వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరిఅర్బన్, జూన్ 15: ఈనెల 22వ తేదీన పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మైనొద్దీన్ శనివారం ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటలకు కదిరి నుంచి ఈ బస్సులు బయలుదేరతాయన్నారు. అరుణాచలం గిరిప్రదక్షిణ చేయడంతో పాటు కాణిపాకం, కంచి, స్వర్ణ దేవాలయాన్ని భక్తులకు చూపించనున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి రానుపోను చార్జీలు ఎక్స్‌ప్రెస్‌లో రూ.1050, సూపర్ లగ్జరీలో రూ.1300 చొప్పున నిర్ణయించామన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్న వివరాలకు 9052537054 ను సంప్రదించాలని సూచించారు.

నేడు రాచినేపల్లిలో దేవర ఎద్దుల వేల్పు

తనకల్లు, జూన్ 15: మండలంలోని రాచినేపల్లి గ్రామంలో ఆదివారం దేవర ఎద్దుల వేల్పు ను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ రెడ్డెప్పనాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రికి దేవరెద్దులు తమ గ్రామానికి వచ్చాయన్నారు. తనకల్లు మండలంలోని చిన్నపల్లి, నంబులపూలకుంట మండలంలోని మేకలచెరువు, గాండ్లపెంట మండలంలోని కోటూరు, నల్లచెరువు మండలంలోని బాలినేని ఎగువతండా, దిగువతండా, పూలకుంటపల్లి, ఓడీసీ మండలంలో చెరువు వాండ్లపల్లి, కుటాగుళ్ల గ్రామాలనుంచి దేవర ఎద్దులు వచ్చాయన్నారు. 20 సంవత్సరాలకు ఒకసారి చేపట్టే ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి వేల్పు కార్యక్రమం, తదుపరి పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కొక్కంటి పాల్లేగాళ్లు పాల్గొంటారని తెలిపారు.

టీడీపీ ఆత్మీయ సమావేశానికి తరలిరండి

నల్లచెరువు, జూన్ 15: కదిరి పట్టణ సమీపంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం టీడీపీ ఆత్మీయ సమావేశం జరగనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పీ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జరగనుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మోకాళ్లపై తిరుమలకు..

● మొక్కు తీర్చుకున్న ఎంపీటీసీ సభ్యుడు



తిరుమలకు మోకాళ్లతో వెళ్తున్న ఎంపీటీసీ శ్రీనివాసులు

ఓబుళదేవరచెరువు, జూన్ 15: మండలంలోని వెంకటాపురం ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు శనివారం తిరుమల కొండకు అలిపిరి మెట్ల నుంచి మోకాళ్లపై నడిచి వెళ్లి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డి గెలుపొందితే తిరుమలకు మోకాళ్లపై వస్తానని మొక్కుకున్నానని, దీంతో కోరిక నెరవేరినందుకు మొక్కు తీర్చుకున్నానని తెలిపారు. ఆయన వెంట నాయకులు వెంకటరామిరెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ పైపులైన్ కనెక్షన్ తొలగింపు



పైపులైన్ కనెక్షన్‌ను తొలగించి దృశ్యం

గాండ్లపెంట, జూన్ 15: మండలంలోని గాజులవారిపల్లి పెద్దతండా పంచాయతీ కల్లుబాయి తండా గ్రామంలో పంచాయతీ బోరుకు రామాంజులనాయక్ అనే వ్యక్తి ఇచ్చిన అక్రమ పైప్‌లైన్ కనెక్షన్‌ను పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. పంచాయతీ బోరుకు రామాంజులనాయక్ అక్రమ కనెక్షన్ ఇచ్చి నీటిని తన పొలానికి వాడుకుంటున్నాడు. దీనిపై గ్రామస్థులు ఎంపీడీఓ రామనాయక్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ అధికారులు అక్రమ కనెక్షన్‌ను తొలగింపజేశారు. జేఈ మాట్లాడుతూ ఇకపై ఇలాంటి అక్రమ కనెక్షన్లు ఎవరైనా తీసుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

ఓబుళదేవరచెరువు, జూన్ 15: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి 1998 ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. పుట్టపర్తిలో శనివారం వారు ఎమ్మెల్యేను కలిశారు. 1998 ఉపాధ్యాయులుగా నియమించిన వారికి పదవీ విరమణ వయస్సు 62 పెంచాలని, రెగ్యులర్ చేయాలని , ఈ మేరకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 1998 ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి కమ్మల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు సమర్థవంతంగా పని చేయాలి

● లేకుంటే వెళ్లిపోవాలి ● సమీక్షలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హెచ్చరిక



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, జూన్ 15: మాది ప్రజా ప్రభుత్వమని, అధికారులు ప్రజా సంక్షేమం కోసం సమర్థవంతంగా పని చేయాలని, లేకుంటే వెళ్లి పోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె పలు శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. మొదట అధికారులు సిబ్బంది ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎలా పని చేశారన్నది తనకు అనవసరమన్నారు. ఇప్పుడు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలన్నారు. ప్రజల సమస్యల్ని తీర్చడానికి సమర్థవంతంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. అలా కుదరదంటే మీకు ఇష్టం వచ్చిన చోటకు వెళ్లిపోవాలని సున్నితంగా హెచ్చరించారు. నియోజకవర్గంలో సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాలనే దానిపై సమీక్షించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, మహిళా సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్ష చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సకాలంలో అందించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆమె తండ్రి, కేరళ మాజీ డీజీపీ శంకరరెడ్డిని అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి రూరల్, జూన్ 15: సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేయడంపై పట్టణంలోని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యుడు లెక్కల యదుభూషణ్ మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్‌టైటిలింగ్ యాక్టు లోపభూయిష్టంగా ఉందన్నారు. భూయాజమాన్యహక్కులకు తీవ్ర విఘాతం కల్గించే విధంగా ఆ చట్టం తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. ఈచట్టాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాలు, న్యాయవాదులు నిరసనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఓటమి చవి చూసిందన్నారు. గత ఎన్నికల్లో దానిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు లెక్కల కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, నాగేంద్ర, జానకంపల్లి శ్రీనివాసులు, నాగార్జున, ధర్మవరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం హర్షం

ముదిగుబ్బ: గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును సీఎం చంద్రబాబు రద్దు చేయడంపై రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బాసినేని రమేష్‌బాబు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు ఆ యాక్టును రద్దు చేస్తూ సంతకం చేయడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన ఆ చట్టం వల్ల రైతులు అభద్రతా భావానికి గురయ్యారన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు సుదీర్ఘకాలం ఆందోళనలు చేశారని గుర్తు చేశారు. అనేక రూపాల్లో రైతు, ప్రజా సంఘాలు విన్నవించినా గత ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందన్నారు. అంతే కాకుండా ఆందోళనకారులపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. సీఎం చంద్రబాబు ఆ కేసులను ఎత్తివేయాలని రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకే 'అమ్మకు వందనం' ఇవ్వాలి: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

నంబులపూలకుంట, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు మాత్రమే అమ్మకు వందనం పథకాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం ఆయన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పథకంలో భాగంగా స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15వేలు ఇస్తామని చెప్పిందన్నారు. అయితే దీనిని ప్రైవేటు బడుల్లో చదువుకునేవారికి కాకుండా కేవలం ప్రభుత్వ బడుల్లో చదివే వారికి మాత్రమే వర్తించేలా చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. పాత పింఛన్ విధనం కొనసాగించాలని, అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులయాదవ్, జిల్లా కౌన్సిలర్లు రమణా నాయక్, షర్ఫీ, రహీమ్, రమణయ్య, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంపై తొలగని జగన్ ఫొటో



నల్లచెరువు సచివాలయం -2పై దర్శనమిస్తున్న జగన్ ఫొటో

నల్లచెరువు, జూన్ 15: వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చింది. అయినా మండలకేంద్రంలోని సచివాలయం -2 భవనంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో తీయడం అధికారులు మరిచారని ప్రజలు చర్చించుకుంటున్నారు. జగన్ ఫొటోలు తొలగించాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలిచ్చినా స్థానిక అధికారులు తొలగించకపోవడం ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే జగన్ ఫొటోలను తొలగించాలని వారు కోరుతున్నారు.

సమయానికి బస్సులు నడపాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రజారవాణా జిల్లా అధికారి మధుసూదన్

కదిరిఅర్బన్, జూన్ 15: ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ బస్సులను సమయానికి నడపాలని జిల్లా ప్రజారవాణాధికారి పీ. మధుసూదన్ సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ చాంబర్‌లో శనివారం ఆయన ఆర్టీసీ అధికారులతో సమీక్ష జరిపి మాట్లాడారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా సమయానికి బస్సులు నడపాలన్నారు. ముఖ్యంగా కదిరి నుంచి బెంగుళూరు, అనంతపురం, తిరుపతి, హైదరాబాద్, విజయవాడ రూట్లలో బస్సులను సమయానికి నడపాలన్నారు. బస్సులు మరమ్మతులకు తగిన సమయం ఇచ్చి, సమయపాలన పాటించేలా చూడాలని గ్యారేజీ ఇన్‌చార్జి రామకృష్ణను ఆదేశించారు. తర్వాత పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనొద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూన్ 15: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న 50 కుటుంబాల వారికి దుస్తులు, నిత్యావసర సరుకులను పుట్టపర్తికి చెందిన కిద్మత్ ఏ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షామీర్ శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టపర్తిలోని సాయిబాలాజీ జ్యువెలరీస్ యజమాని నాగభూషణం సహకారంతో పేదలకు వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చాంద్, జావిద్, సోహెల్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి భారీ ఏర్పాట్లు



భోజనాల కోసం ఏర్పాటు చేస్తున్న టెంటు

కదిరి, జూన్ 15: పట్టణం సమీపంలోని పీవీఆర్ గ్రాండ్‌లో ఆదివారం కూటమి ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రెండు రోజుల నుంచి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరవుతుండడంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. దాదాపు 20వేలమంది హాజరు కావచ్చని నాయకుల అంచనా. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తనకల్లు, జూన్ 15: మండలంలోని ఎగువతొట్లిపల్లికి చెందిన నారాయణప్ప (64) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ధరణిబాబు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణప్ప గత రెండురోజులక్రితం పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత తిరిగి రాలేదు. దీంతో భార్య సుబ్బమ్మ బళ్లారిలో ఉన్న తన కుమారుడు, రాయచోటిలో ఉన్న కుమారైకు సమాచారం అందించారు. అలాగే చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియలేదు. కాగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని మోరీ వద్ద దుర్వాసన వెదజల్లుతుండడంతో గ్రామస్థులు పరిశీలించారు. మోరీ కింద నారాయణప్ప మృతి చెందిన విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులతో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన ఎలా మృతి చెందాడన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

డ్రైనేజీల్లో పూడికతీత



డ్రైనేజీల్లో పూడిక తీస్తున్న దృశ్యం

గాండ్లపెంట, జూన్ 15: మండలకేంద్రంలోని మురుగు కాలువల్లో నిండిన పూడికను శనివారం పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. కదిరి, రాయచోటి ప్రధాన రహదారి పక్కన పాత మసీదు వద్ద నుంచి చెరువులోకి మురుగు కాలువలు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆకాలవలు చెత్తాచెదారం, ఇసుకతో పూడిపోయి మురుగునీరు ముందుకెళ్లలేక రోడ్డుపై పారుతుండేది. దీంతో పాదచారులు, ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతుండేవారు. స్పందించిన అధికారులు కాలువల్లో పూడిక తీత చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాషా, సర్పంచ్ రహమత్, సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి, జూన్ 15 : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం దేవదాయశాఖ అధికారి నరసింహరాజు, ఛైర్మన్ రమానంద్ ఆధ్వర్యంలో లెక్కించారు. 105రోజులకుగాను రూ.4,47,374 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, జూన్ 15: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి అలంకరణలు గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని అర్చనలు చేయించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే అన్నదానం జరిగింది. పెద్దయల్లంపల్లి ఎస్సీ కాలనీ భక్తబృందం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ధర్మవరం కూటమి నాయకులు



మంత్రి సత్యకుమార్‌తో కూటమి నాయకులు

ధర్మవరం, జూన్ 15: రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ధర్మవరానికి చెందిన కూటమి నాయకులు రవీంద్రనాయుడు, మధుసూదన్ శని వారం విజయవాడలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రి వర్గంలో సత్యకుమార్‌కు చోటు కల్పించడం హర్షణీయమన్నారు. సత్యకుమార్ ధర్మవరం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి అనంతజిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తారని భావిస్తున్నామన్నారు.

అరాచకాల వల్లే వైసీపీ కనుమరుగు

● కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి ● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



సమావేశంలో మాట్లాడుతున్న చిలకం మధు

ధర్మవరం, జూన్ 15: గత వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేయడం వల్లనే ఆ పార్టీ రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగైందని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ప్రజలు విసిగిపోయారన్నారు. దీంతో ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పి మూలన కూర్చోబెట్టారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్ల అధికారంలో ఉంటుందన్నారు. సత్యకుమార్‌యాదవ్‌కు మంత్రి వర్గంలో చోటు కలిగినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్‌తో కలిసి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, వెంకటరెడ్డి, బాలక్రిష్ణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన ఎమ్మెల్యే పల్లె సింధూర



ఎస్పీతో ఎమ్మెల్యే సింధూర, మాజీమంత్రి రఘునాథ రెడ్డి తదితరులు

పుట్టపర్తి రూరల్, జూన్ 15: జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవ రెడ్డిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఆమె ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై చర్చించారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడరాదని ఎస్పీని కోరారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టిన పోలీసు యంత్రాంగాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్రమణ్యం

ధర్మవరం, జూన్ 15: ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన హిందూ ముస్లింలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోని ముస్లింలందరూ బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పండుగ వేళ ఎక్కడా ఎలాంటి గొడవలు సృష్టించరాదన్నారు. ముస్లింలు ఈద్గా మైదానానికి వెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ముస్లింలు నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, అత్తార్‌రహీంబాషా, చాంద్‌బాషా, ఖలీల్‌రహమాన్, కుళ్లాయప్ప, హిందువులు సాకేఓబులేశు, జింకాచంద్రశేఖర్, గుండాపుల్లయ్య, చంద్రమౌళి, బిల్లేరవి తదితరులు పాల్గొన్నారు.

గో వధ చేయరాదు: ఎస్ఐ

నల్లచెరువు: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐ కేఎం లింగన్న ముస్లింలకు గో వధపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండగ సందర్భంగా ముస్లింలు గోవధ చేయరాదన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ గోవులు ఎంతో పవిత్రమైనవని, వాటిని వధించడం చట్టరీత్యానేరమని తెలిపారు. ఈ సమీక్షలో మండల కేంద్రంతో పాటు కె.పూలకుంట, అల్లుగుండు, ఉప్పార్లపల్లి, నల్లచెరువు, దేవరింటిపల్లి గ్రామాలకు చెందిన ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి



ఏఎస్ఐకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

తనకల్లు, జూన్ 15: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ మండలంలోని వీహెచ్‌పీ నాయకులు శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొందరు గోవులను లారీల్లో వివిధ ప్రాంతాల్లోని కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నారని, అక్కడ వాటిని వధించి మాంసం విక్రయిస్తున్నారని వాపోయారు. వెంటనే వాటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు శ్రీనాథ్, బీజేపీ నాయకులు బాలాజీ, సురేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా

హిందూపురం, జూన్ 15: ఇటీవల ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్య కేసులో ప్రధాన నిందుతులను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం కాంగ్రెస్, ఆర్ఎస్‌పీ, బీఎస్‌పీ, సీపీఎం. సీపీఐ దళిత సమాఖ్య నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళిత కులానికి చెందిన యువకుడిని దారుణంగా హత్య చేస్తే ప్రధాన నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. హత్యకు గురైన వ్యక్తి హిందూపురానికి చెందిన వాడని, అయితే ధర్మవరంలో నిందితుల అరెస్ట్ చూపడం, అక్కడి పోలీసులు దర్యాప్తు చేపట్టడం చూస్తుంటే కేసును తప్పుదోవ పట్టించే విధంగా ఉంద న్నారు. ఏడాదిన్నర క్రితం వైసీపీ నాయకుడు చౌళూరు రామక్రిష్ణారెడ్డి హత్య, యువ న్యాయవాది ఎన్‌ఎస్‌యుఐ నాయకుడు సంపత్ హత్య రెండూ సుపారీ హ త్యలే కావడంతో సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో ఇలాంటి హత్యలు జరగడం దారుణమ న్నారు. ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గురుస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాంకిరణ్, బీఎస్పీ శ్రీరాములు, శ్రీనివాసులు, రమణ, మున్న, నారాయణ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి, జూన్ 15 : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం దేవదాయశాఖ అధికారి నరసింహరాజు, చైర్మన్ రమానంద్ ఆధ్వర్యంలో లెక్కించారు. 105రోజులకుగాను రూ.4,47,374 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

భూతప్పస్వామికి ప్రత్యేక పూజలు


గుడ్డగుర్కి గొల్లహట్టిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల, జూన్ 15: మండలంలోని గుడ్డగుర్కి గొల్లహట్టి గ్రామంలో వెలిసిన భూతప్పస్వామికి శనివారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ముందు మొక్కుకున్న మేరకు రాష్ట్రంలో టీడీపీ, మడకశిర ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు విజయం సాధించడంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు దాసిరెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, యూనిట్ ఇన్‌చార్జ్ హేమంత్, నాయకులు వెంకటేష్, నాగరాజు, ఆనంద్, రామకృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని మేకలగట్ట, ఎస్ గొల్లహట్టి గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భూతప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారం లోకి రావాలని మొక్కుకున్న మేరకు నాయకులు, కార్యక ర్తలు పెద్దఎత్తున తరలి వెళ్ల భూతప్పస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

'ఎస్సీలకు టీడీపీలో సముచిత స్థానం'

పెనుకొండ టౌన్, జూన్ 15 : ఎస్సీలకు సముచిత స్థానం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీఅని దళిత సంఘం నాయకులు అన్నారు. చంద్రబాబు నాయుడు దళితులను గుర్తించి వంగలపూడి అనితకు హోంశాఖ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే అధికంగా దళితులపై దాడులు జరిగాయని ప్రస్తుత టీడీపీ పాలనలో అలాంటివేవి ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, కిష్టప్ప, హనుమంతు, సజ్జరాయుడు, మహేంద్ర, నరేష్, బైలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

హిందూపురం అర్బన్, జూన్ 15: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వార నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకుడు ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్ (ఇంటర్ పాస్ అయి ఉండాలి) ఎలక్ట్రీషియన్ (పదో తరగతి పాస్ అయిఉండాలి) వయసు 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. రెండు నెలల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధ్రువీకరించిన అధ్యాపకులచే శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లను అందిస్తామన్నారు. బెంగళూరు లాంటి నగరాల్లో ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణా కాలంలో 20 శాతం థియరీ, 80 శాతం ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఆసక్తి గల యువకులు ఈ నెల 20 లోగా ఆధార్ జిరాక్స్, రేషన్‌కార్డుజిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, తీసుకురావాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9252901657, 9440013302ను సంప్రదించాలన్నారు.

మీసేవా కేంద్రాల తనిఖీ


ఆధార్ సీడింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి శివారెడ్డి

గోరంట్ల, జూన్ 15: మండలంలోని బూదిలి, గోరంట్లలోని మీసేవా కేంద్రాలను జిల్లా నోడల్ అధికారి తీగల శివారెడ్డి శనివారం తనిఖీ చేశారు. బూదిలి గ్రామంలోని మీసేవ కేంద్రాన్ని, గోరంట్ల మండల కాంప్లెక్సులోని ఆధార్ సీడింగ్ కేంద్రాన్ని సందర్శించి పనితీరును పరిశీలించారు. ఆయా కేంద్రాలకు పనుల నిమిత్తం వచ్చిన వారితో అక్కడి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పనిచేస్తూ ప్రజలనుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. పుట్టపర్తి డివిజన్‌లో 24 మీసేవా కేంద్రాలు, నాలుగు ప్రైవేటు ఆధార్ సీడింగ్ కేంద్రాలు పనిచేస్తున్నా యని ఆయన తెలిపారు.

ముస్లింలతో తహసీల్దార్ సమావేశం

గోరంట్ల, జూన్ 15: బక్రీద్ పర్వదిన సందర్భంగా శాంతి భద్రతలకు, ప్రజాజీవనానికి ఎలాంటి అవాంతరం కలగకుండా చూడాలని ముస్లింలను తహసీల్దార్ అక్బల్ బాషా ఆదేశించారు. శనివారం గోరంట్లలోని తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. బక్రీదు పండుగ రోజు కుర్బానీ సమయంలో ఇతరులకు ఇబ్బంది కలకుండా శుభ్రత పాటించాలన్నారు. ఈసమావేశంలో మైనార్టీ నాయకులు ఉమ్మర్ ఖాన్, ఉస్మాన్‌ఖాన్, మహమ్మద్ తదితరులున్నారు.

టీడీపీ నాయకుడి మృతి

అగళి, జూన్ 15 : మండలంలోని ఇరిగేపల్లి కి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మండల మాజీ కన్వీనర్ ముకుందప్ప శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుమారుడు సర్పంచ్ లక్ష్మమ్మ లింగరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం లోబీపీతో గుండెపోటు రావడంతో ఆయనను కర్ణాటకలోని శిర ఆసుపత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుమారులు లింగరాజు, మంజునాథ్ తెలిపారు. పార్టీ ప్రారంభం నుంచి నేటి వరకు ముకుందప్ప పార్టీలోనే కొనసాగుతున్నారు. ముకుందప్ప మృతి టీడీపీకి తీరని లోటని జడ్పీటీసీ ఉమేష్, టీడీపీ మండల నాయకులు అన్నారు. మృతుడి కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అన్నిరాఆజకీయ పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు..

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెనుకొండ రూరల్, జూన్ 15 : మండలంలోని మావటూరు సమీపంలో పేకాడుతున్న ఆరు గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజేష్ శనివారం తెలిపారు. గ్రామ సమీపంలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8960నగదు స్వాధీనం చేసుకుని 14ద్విచక్రవాహనాలు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

అన్న క్యాంటిన్ పునః ప్రారంభానికి ఏర్పాట్లు


అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జూన్ 15: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటిన్‌ల పునః ప్రారంభానికి నాలుగో సంతకం చేశారని టీడీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు భక్తర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా, పట్టణ అధ్యక్షుడు మనో హర్ అన్నారు. అందుకు అనుగుణంగా శనివారం పట్టణం లోని అమరాపురం రహదారిలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటిన్ భవనాన్ని పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సూచనల మేరకు అధికారులతో కలిసి పనులు చేపట్టారు. ఇక్కడి అన్న క్యాంటిన్ ఐదు సంవత్సరాలుగా మూతపడటంతో భవనం లోపల చిన్న చిన్న మరమ్మతులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అన్న క్యాంటిన్‌ను 15 రోజుల్లో పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ఉమాశంకర్, శ్రీనివాసులు, హనుమంతు, తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, నాయకులు రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానం

హిందూపురం అర్బన్, జూన్ 15: విద్యా సంవత్సరం 2023 -24కు సంబంధించి ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సగర, ఉప్ప విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు భగీరథ ఎడ్యుకేషనల్ సేవాట్రస్ట్, సభ్యులు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉదయం 10 గంటలకు స్థానిక సప్తగిరి కళాశాలలో హాజరు కావాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9440513084, 9912394649ను సంప్రదించాలన్నారు. అలాగే 2024వ సంవత్సరంలో ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం పట్టణ పరిధిలోని వాల్మీకి భవన్‌లో పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు విద్యార్థులు, వారి తల్లితంద్రులు హాజరు కావాలని కోరారు.

మాట తప్పని చంద్రబాబు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప
- ఐదు పథకాలకు సంతకాలపై హర్షం

హిందూపురం, జూన్ 15 : ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రధాన అంశాలైన ఐదింటిపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వైసీపీ ప్రభుత్వంపై నిరుద్యోగులు రగిలిపోతున్నారు. అయితే చంద్రబాబు మొదటి సంతకమే డీఎస్సీపై పెట్టడం, రైతులకు నష్టం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం, రూ.4వేలు పింఛన్ చేయడం, నైపుణ్యగణనపై సంతకాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఏకంగా 16,347ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేస్తామని ప్రకటించడం సంతోషించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రెండో సంతకాన్ని రద్దుపై పెట్టారన్నారు. భరోసా పింఛన్‌ను వైసీపీ ఐదేళ్లలో రూ.వెయ్యి పెంచిందని, అయితే హామీ ఇచ్చిన మేరకు చంద్రబాబు మొదటి నెల నుంచే రూ.4వేలు ఇస్తామని మూడోసంతకం పెట్టారన్నారు. అంతేకాక ఏప్రిల్ నుంచే ఇస్తామని చెప్పడంతో జూలై నెలలో రూ.7వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనివల్ల రూ.66లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. దివ్యాంగులకు రూ.6వేలకు పెంచారు. వారికి కూడా పెంచిన మొత్తం కలిపి రూ.12వేలు ఇవ్వనున్నారన్నారు. అలాగే రాష్ట్రంలో వివిధ కళాశాలల నుంచి 4.4లక్షల మంది విద్యార్థులు బయటికి వస్తున్నారని, సరైన నైపుణ్యాలులేక చాలా మంది నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. అలాంటివారికోసమే నైపుణ్య గణన చేసి శిక్షణ ఇచ్చేందుకు చంద్రబాబు సంతకం చేశారన్నారు. ఎంతో మంది నిరుపేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటిన్‌లను వైసీపీ అధికారంలోకి రాగానే రద్దుచేసిందని, అయితే వాటిని పునరుద్ధరిస్తూ చంద్రబాబు ఐదో సంతకం చేశారన్నారు. రాబోయే వంద రోజుల్లో అన్న క్యాంటిన్‌లు రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు కడుపు నింపుతాయన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి రోజే సంతకాలు పెట్టడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు.

ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలి

- సంపత్ కుటుంబాన్ని ఆదుకోవాలి
- వివిధ పార్టీల నాయకుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా


తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

హిందూపురం, జూన్ 15: ఇటీవల ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్య కేసులో ప్రధాన నిందుతులను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం కాంగ్రెస్, ఆర్ఎస్‌పీ, బీఎస్‌పీ, సీపీఎం. సీపీఐ దళిత సమాఖ్య నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళిత కులానికి చెందిన యువకు డిని దారుణంగా హత్య చేస్తే ప్రధాన నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. హత్యకు గురైన వ్యక్తి హిందూపురానికి చెందిన వాడని, అయితే ధర్మవరంలో నిందితుల అరెస్ట్ చూపడం, అక్కడి పోలీ సులు దర్యాప్తు చేపట్టడం చూస్తుంటే కేసును తప్పుదోవ పట్టించే విధంగా ఉంద న్నారు. ఏడాదిన్నర క్రితం వైసీపీ నాయకుడు చౌళూరు రామక్రిష్టారెడ్డి హత్య, యువ న్యాయవాది ఎన్ఎస్‌యుఐ నాయకుడు సంపత్ హత్య రెండూ సుపారీ హ త్యలే కావడంతో సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రశాం తతకు మారుపేరైన హిందూపురంలో ఇలాంటి హత్యలు జరగడం దారుణమ న్నారు. ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గురుస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాంకిరణ్, బీఎస్పీ శ్రీరాములు, శ్రీనివాసులు, రమణ, మున్న, నారాయణ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మీ వల్ల కుటుంబాలకు ఇబ్బందులు

ఖైదీలకు న్యాయాధికారి శ్రీధర్ హితబోధ


జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

హిందూపురం, జూన్ 15 : క్షణికావేశంలో మీరు చేసిన తప్పులకు జైలుపాలు కావడంతో ఇళ్లలో ఉన్న మీ కుటుంబ సభ్యులు ఎంతో ఇబ్బంది పడుతుంటా రని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్ ఖైదీలతో పేర్కొన్నారు. న్యాయాధికారి శనివారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడుతూ వారు చేసిన నేరాలపై ఆరాతీశారు. ఎవరికైనా న్యాయవాదిని నియమించుకునే స్థోమతలేకపోతే అలాంటివారికి కోర్టే న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. క్షణికావేశంలో తప్పులు చేసి ఇలా జైలు పాలైతే మీ కుటుంబాలు గౌరవ మర్యాదలు కోల్పోవడంతోపాటు ఆర్థికంగా చితికిపోతారన్నారు.జైలులో అమల వుతున్న సౌకర్యాలపై న్యాయాధికారి ఆరాతీశారు. న్యాయాధికారి వెంట న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సుదర్శన్, నాగరాజరెడ్డి, వెంకటేశ్, జైలు సూపరింటెండెంట్ అంజినాయక్, లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కష్టపడిన వారికి గుర్తింపు'

గుడిబండ, జూన్ 15 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో టీడీపీ విజయానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను టీడీపీ విడతలవారీగా అమలు చేస్తుందన్నారు. ఈ విజయం కార్యకర్తలదేనన్నారు. టీడీపీ విజయానికి కష్టపడిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, నాయకులు, దుర్గేష్, శివకుమార్, లక్ష్మీనరసప్ప, షబ్బీర్, భీమరా జు, రామతమన్న, రాజేంద్ర, లక్ష్మీనారాయణ, నజీర్‌అహ్మద్, భోజరాజు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల అందజేత

చిలమత్తూరు, జూన్ 15: ఫ్లోరోసిస్ అనుమానాస్పద బాధితులకు అవసరమైన పలు రకాల పరికరాలను డాక్టర్ తేజశ్విని అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం బాధితులకు నడుము బెల్టులు, మెడ బెల్టులు, వాకర్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అనుమానాస్పద కేసులను గుర్తించామన్నారు. అనంతరం వారికి పరీక్షలను నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేశామన్నారు వ్యాధుగ్రస్థులకు తగిన వైద్యం అందిస్తు న్నట్లు తెలిపారు. అవసరమైన వారిరి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

అగళి, జూన్ 15 : పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మడకశిర హెల్త్ ఇన్‌స్పెక్టర్ షమీవుల్లా పేర్కొన్నారు. అగళి మండలంలోని మధూడి, అగళి బీసీ హాస్టళ్లను ఆయన శనివారం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, వివిధ రోగాలు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వార్డెన్ సికిందర్ బాషాతో మాట్లాడి హాస్టల్ గదులలో, పరిసరాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా ఈ చర్యలు చేపట్టినట్లు హెల్త్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

పుట్టపర్తి రూరల్, జూన్ 15: తక్కువపెట్టుబడి, అధిక దిగుబడి లక్ష్యంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ సిబ్బందికి నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ జరిగింది. ఇందులో ఏరువాక శాస్త్రవేత్తలు జాన్సన్, రామసుబ్బయ్య, కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణ పాల్గొని వేరుశనగ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, వేరుశనగ విత్తన ఉత్పత్తిపై స్క్రీన్ ద్వారా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్‌సీడ్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ కేశవమూర్తి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విద్యావతి, మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు : కలెక్టర్


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, సీఎస్, ఎమ్మెల్యే

పావగడ, జూన్ 15 : పనులపై వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ... విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎవరినైనా ఉపేక్షించే ప్రసక్తి లేదని జిల్లా కలెక్టర్ శుభకల్యాణి అధికారులను, ఉద్యోగులను హెచ్చరించారు. అటువంటి వారిని ఒకటికి రెండు సార్లు హెచ్చరిస్తామని, అయినా మార్పు రాకపోతే డిస్మిస్‌కు సిఫార్సు చేస్తామన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం నిర్వహించిన జనస్పందన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ సీఈఓ ప్రభు, చీఫ్ సెక్రెటరీ తులసి మద్దినేని, ఎమ్మెల్యే వెంకటేశ్, అడిషనల్ ఎస్పీ మరియప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ ప్రభు మాట్లాడుతూ... అధికారులు కార్యాలయంలోనే కాకుండా జనం మధ్యలోకి వెళ్లి వారి సమస్యలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. చీఫ్ సెక్రెటరీ తులసి మాట్లాడుతూ... పావగడ తాలూకాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు కార్యకర్తలు సమయానికి హాజరు కావడంలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే చిన్ని పిల్లలపట్ల శ్రద్ధ వహించి వారి ఆరోగ్యంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం వారిపై ఉందని సూచించారు. ఇదిలా ఉండగా తమ అర్జీలను జిల్లా కలెక్టర్‌కు కాకుండా చీఫ్ సెక్రెటరీకి అందజేయాలని రైతు సంఘం నాయకులు పట్టుబట్టడంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు పోలీసులు ప్రవేశించి పరిస్థితిని అదుపుచేయడంతో అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ జానకీరాం, తహసీల్దార్ వరదరాజు, సీడీపీఓ సునీత, తాలూకాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీపై డీవైఈఓ తనిఖీ


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈఓ రంగస్వామి

అగళి, జూన్ 15 : పెనుకొండ డీవైఈఓ రంగస్వామి శనివారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. పాఠశాల లు ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలకు విద్యాకిట్ల పంపిణీపై ఆరాతీశారు. మండల వ్యాప్తంగా 45 పాఠశాలలకు పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు, డీవైఈఓకు తెలిపారు. ఐదు రూట్‌లుగా ఏర్పడి పంపిణీ చేశామన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలతో పాటు సామగ్రి అంతా సరఫరా చేస్తామన్నారు. అనంతరం అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి పాఠ్యపుస్తకాల పంపిణీపై హెచ్ఎం వరదరాజులుతో ఆరాతీశారు. ఉపాధ్యాయుల హాజరు రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

బహిరంగ ప్రదేశాల్లో పశు వధ నేరం: కమిషనర్

హిందూపురం, జూన్ 15:

బక్రీద్‌ను పురస్కరించుకొని నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాలలో పశువులను వధిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతేకాకుండా 14 సంవత్సరాల లోపు వయసున్న ఎద్దులు, గేదెలు, దున్నలను వధించకూడదని, పశువైద్యుడి ధ్రువీకరణ ఉంటేనే వాటిని వధించాలన్నారు. లేదంటే చర్యలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఆవులను, దూడలను వధిస్తే అలాంటి వారిపై కేసు నమోదుచేస్తామన్నారు.

దివంగత ప్రిన్సిపాల్‌కు ఘన నివాళి

పెనుకొండ రూరల్, జూన్ 15 : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి గత యేడాది గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. కళాశాలలో శనివారం వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ఆధ్వర్యంలో రమేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి అధ్యాప కులు, విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ జయప్ప మాట్లాడు తూ అనతికాలంలోనే కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని మరువలేమన్నారు. అధ్యాపకులు ప్రతాప్ మాట్లాడుతూ కళాశాలకు కియ కంపెనీ నుంచి లైబ్రరీ వసతులు కల్పించడంలో రమేష్‌రెడ్డి కృషి మరువలేమన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరీష్‌బాబు, రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రదుర్గ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురి దుర్మరణం


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జు అయిన కారు, మృతదేహాలు

పావగడ, జూలై 15: కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా చిక్కబెన్నూరు గ్రామం వద్ద శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మృతులను ప్రజ్వల్ రెడ్డి(30), హర్షిత(28), సోహన్(2), విజయరెడ్డిగా గుర్తించారు. శిల్ప, స్వర్ణ చార్, మధుమిత, శిచిక్రిష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరు చికిత్స పొందుతున్నారు. బెంగళూరులోని తణసంద్ర ప్రాంతానికి చెందిన వీరంతా ఫార్చ్యునర్ కారులో గోవాకు బయలుదేరారు. చిక్కబెన్నూరు గ్రామం వద్ద వెనుక వైపు వస్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి కారును బలంగా ఢీ కొంది. దీంతో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్నవారిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని దావణగెరెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయరెడ్డి అనే మహిళ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే చిత్రదుర్గ ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. భరమసాగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: బీజేపీ


వీధిదీపాలు వేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జూన్ 15: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అంజలి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 11వ వార్డు మోడల్ కాలనీలో శనివారం వీధిదీపాలు పునరుద్ధరించారు. కొద్ది రోజులుగా వీధిదీపాలు వెలుగడం లేదు. దీంతో మునిసిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బందిని పంపించి వీధి దీపాలు వెలిగేలా చేశారు. అదే విధంగా కాలువలు శుభ్రం చేసి మురుగు నీరు నిలువ ఉండకుండా, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాసులు, మల్లికార్జున, ప్రదీప్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జూన్ 15: మడకశిర పట్టణంలోని 17వవార్డు పాత ఎస్సీ కాలనీలో గత నెల రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు చొరవ చూపారు. నెల రోజులకుపైగా సమస్య ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి వెళ్లగా... ఆయన వెంటనే సమస్య పరిష్కారానికి స్థానిక నాయకులకు సూచనలు చేశారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి స్టార్టర్, మోటారు మరమ్మతులు పూర్తి చేసి, తాగునీటి సమస్య ను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీపీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి శంకర్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, జనసేన మండల అధ్యక్షులు శివాజీ, నాయకులు రవి, మంజు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

హిందూపురం అర్బన్, జూన్ 15: వార్డులోని ప్రజలతో పాటు వార్డులో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు, వలంటీర్లు అందరూ తమ వారే అని 17వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ హిదయతుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని గడ్డమీద ప్రాంతం 17వ వార్డులోని ప్రజలతో పాటు, వార్డులో పనిచేసే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వార్డులో వలంటీర్లుగా విధులు నిర్వహించిన వారికి శనివారం హిదయతుల్లాతో పాటు టీడీపీ నాయకులు ఎండీఎస్ ప్యారూసాబ్, ఇందాద్ దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా దుస్తులు అందించి నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో హిందూపురం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వలంటీర్లను నియమించిన వైసీపీ ప్రభుత్వమే బలవంతంగా వారిచేత రాజీనామాలు చేయించిందన్నారు. చిన్న ఉద్యోగులను కూడా వేధించిన దుర్మార్గ ప్రవర్తన వైసీపీ నాయకులదని విమర్శించారు. అయితే టీడీపీ ప్రభుత్వంలో ఎవరిపైనా ఎటువంటి కక్ష సాధింపులు ఉండవన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, జూన్ 15: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు ,అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని అర్చనలు చేయించారు. భక్తుల కు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే అన్నదానం జరిగింది. పెద్దయల్లంపల్లి ఎస్సీ కాలనీ భక్తబృందం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సభ్యులు తదిత రులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

'అంగన్‌వాడీ పిలుస్తోంది'


పుట్టగుండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమం

గోరంట్ల, జూన్ 15: మండలంలోని పుట్టగుండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ప్రీస్కూల్ పిల్లల తల్లితండ్రులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీకేంద్రంలో చేర్పించాలని ప్రజలను కోరారు. ఐదేళ్లు నిండిన అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేక దుస్తులు వేసి గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వారిని ప్రభుత్వ పాఠశాలకు తీసుకెళ్లి ప్రవేశాలు చేయించారు. ఉపాధ్యాయుడు సురేష్, ఎంఎస్‌కే భారతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్తలు అరు ణ, లక్ష్మీబాయి, సాలెమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులున్నారు.

అగళి: మండలంలోని నర్సంబుది గ్రామంలో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులతో కలిసి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, అంగన్‌వాడీ ఆయాలు కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.